www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025
5
అన్నమయ్య

జెవివి వేసవి శిక్షణ శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసిం దని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ వర్క్ నేర్పించిన ఒరిగామి నిపుణులు గోపాల్‌దాస్ రాజశేఖర్ మాట్లా డుతూ వేసవినోదం కార్యక్రమంలో పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచే పేపర్ డ్రాయింగ్ ,పెయింటింగ్ లాంటి నైపుణ్యంతో కూడిన కళలు విద్యార్థులకు నేర్పించడం జరిగిందని అన్నారు. ఇవి పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడంతోపాటు, పని అనుభవాన్ని, బృందంతో కలిసి పనిచేసే అలవాటును, కలల పట్ల ఆరాధనను పెంపొందిస్తాయని తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, రామయ్య మాట్లాడుతూ పది రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇటువంటి వేసవి శిక్షణ శిబి రాలు పిల్లలను సెల్ ఫోన్ వ్యసనానికి దూరం చేస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు విద్యా ర్థులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పిల్లలందరికీ బహు మతులు అందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు గోపాల్ దాస్ రాజశేఖర్, బయారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడుకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి రాజకీయాల్లో ప్రజానాయకుడిగా పేరు సంపాదించుకున్న సుగవాసి పాలకొండ్రాయుడు అంత్యక్రియలను గురువారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల ప్రీతం రెసిడెన్సీ నుంచి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పార్థివ దేహాన్ని బస్టాండ్, నేతాజీ సర్కిల్,టానా సర్కిల్, బండ్లపెంట, మాసాపేట, మునెప్పగారిపల్లి, కోనేటిబుగ్గ, పాత రాయచోటి మీదుగా గౌతం థియేటర్ సమీపంలోని సుగవాసి పాలకొండ్రాయుడు ఘాట్ వద్దకు 5 కిలోమీటర్ల మేర కుటుంబ సభ్యులు, అభిమానుల అంతిమయాత్ర సాగింది.అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలకొండ్రాయుడు అంత్య క్రియలు అధికార లాంచనాలతో నిర్వహించారు. పాలకొండ్రాయుడు పార్థవదేహనికి జిల్లా అడిషనల్ ఎస్పి ఎం.వెంకటాద్రి, ఆర్‌డిఒ శ్రీనివాసులు,ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి సుగవాసి పాలకొండ్రయుడు మృతదేహానికి గౌరవ వందనం చేసి అంత్యక్రియలు ముగించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపతి జనసేన పార్టీ నేత హరిప్రసాద్, తానా మాజీ అధ్యక్షులు వేమన సతీష్, సుండుపల్లి మండల టిడిపి నేత చప్పిడి మహేష్ నాయుడు, రాయచోటి నియోజకవర్గం టిడిపి నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పాలకొండ్రాయుడు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో ఉమ్మడి కడప జిల్లాలోని పలు నియోజవర్గాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు రాయచోటి నియోజక వర్గంలోని ఆరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడు అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, ప్రజలు

రాజంపేట టిడిపి నేతల నివాళి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడికి రాజంపేట తెలుగుదేశం నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్, జిల్లా పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, శామీర్ భాష, గీతాంజలి రమణ, నాగినేని నాగేశ్వర్ రావు, కే.ఎస్ నరసింహ, సుధాకర్, వరదయ్య,తోట రామయ్య, అబ్బిగారి గోపాల్, త్రివేణి, ప్రేమ్ కుమార్, శివ తదితరులు రాయచోటి లోని పాలకొండ్రాయుడి భౌతిక దేహానికి గురువారం నివాళులు అర్పించారు.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌అండ్‌బి జిల్లా స్థాయి రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అజెండా అంశాలలో 2023, 2024లో జరిగిన ఇంటిగ్రేటెడ్ రోడ్డు ప్రమాదాల డేటా విశ్లేషణ, మూడు కంటే ఎక్కువ మరణాలపై ఉమ్మడి తనిఖీ అంశాలపై సమీక్షించారు. 2025-26లో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలు పరచడం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు పరిహారం, గత రోడ్డు భద్రత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇందులో 2023లో మొత్తం 699 ప్రమాదాలు జరుగగా, 325 ప్రాణాంతకం కేసులు, 374 ప్రాణాంతకం కానివి, 367 మరణాలు, 910 మంది గాయపడినట్లు తెలిపారు. 2024లో మొత్తం 649 ప్రమాదాలు జరుగగా, ఇందులో 316 ప్రాణాంతకం కేసులు, 333 ప్రాణాంతకం కానివి, 356 మరణాలు, 825 మందికి గాయాలయ్యాయని అన్నారు. 2025లో ఇప్పటివరకు మొత్తం 253 ప్రమాదాలు జరుగగా, ఇందులో 112 ప్రాణాంతకం కేసులు, 141 ప్రాణాంతకం కానివి, 123 మరణాలు, 272 మంది గాయపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించి రోడ్లలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయడం జరిగిందన్నారు. గడచిన రెండు ఏళ్లలో జరిగిన పరిణామాల దృష్ట్యా అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని, అవగాహనతోనే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అన్ని బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి రహదారి మలుపు వద్ద సూచిక బోర్డులు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో హిట్ అండ్ రన్ 24 కేసులకు పరిహారం ఇంకను మంజూరు చేయాల్సి ఉందని ఈ విషయంలో 15 రోజుల్లోగా పరిహారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు రోడ్డు భద్రత అజెండా అంశాలలో తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్కు వివరించారు. 2024లో మొత్తం 1476 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, 2025లో ఇప్పటి వరకు 745 నమోదు అయినట్లు తెలిపారు. 2025లో జనవరి నుండి ఏప్రిల్ వరకు ఉల్లంఘన వారీగా 42వేల కేసులకు మోటారు వాహనాల చలాన్లు జారీ చేసినట్లు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు హిట్ అండ్ రన్ కేసులు పెద్ద వాహనాలు, లారీ డ్రైవర్లకు రాత్రి వేళల్లో 9.30 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు టోల్ గేట్ల వద్ద వాష్ అండ్ గో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్‌డిఒ శ్రీనివాస్, అడిషనల్ ఎస్‌పి వెంకటాద్రి, ఆర్ అండ్ బి జిల్లా అధికారి సహదేవరెడ్డి, జిల్లా రవాణా అధికారి ప్రసాదు, ఎంవిఐలు, పోలీస్ శాఖ అధికారులు, డిస్‌పిలు, ఎన్‌హెచ్‌ఎఐ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

టమో'రా'

ధరలు లేక రోడ్లపై పారబోస్తున్న రైతులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆరుగాలం కష్టపడి, లక్షలు ఖర్చు చేసి పండించిన టమోటాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుల కష్టం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. కిలో టమోట రూ.5 పలుకుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పండించిన టమోటాలను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ మదనపల్లెలో ఉంది. రైతులు మదనపల్లె మార్కెట్ తెచ్చిన టమోటాలు భారతదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలకు ఎగుమతులు అవుతాయి. గత వారం నుంచి మదనపల్లె మార్కెట్లో టమాటా ధరలు భారీగా పతనమయ్యాయి. గురువారం కిలో టమాటా కనిష్ఠంగా రూ.5 పలుకగా గరిష్ఠంగా రూ.9 లకు విక్రయించారు. వారంకిందట రూ.12 వరకు ఉన్న ధర ప్రస్తుతం గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లెతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో రైతులు పండించిన టమోటాలను మార్కెట్‌కు తీసుకురావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. 10 కిలోల మొదటి రకం టమోటా రూ. 90 పలకడంతో రైతులకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. దీంతో పొలాల పక్కనే రోడ్లపై టమోటాలను పారబోస్తున్నారు. ఇంకొంతమంది రైతులు కూలీలు చెల్లించలేక పొలాల్లోనే వదిలేస్తున్నారు. గతంలో పాలకులు మదనపల్లెలో టమోటాలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, టమోట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీలిచ్చినా ఇంతవరకు అమల్లోకి రాకపోవడంతో టమోట రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి టమోటాలకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధరలు లేకపోవడంతో రోడ్డు పక్కన పడేసిన టమోటాలు

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)ల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)లు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షకు సిపిఎం జిల్లా కన్వీనర్‌తోపాటు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, జిల్లా అధ్యక్షులు ఎస్. నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ వెంటనే సంబంధిత సంఘాల ప్రతినిధులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలోని కేడర్లకు ఎంటిఎస్ అమలు చేయకుండా వివక్ష చూపుతుందన్నారు. 2022 వరకూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని కేడర్లకు ఎంటిఎస్ అమలు చేసేదన్నారు. 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని తెలిపారు. దీని వల్ల ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని కేడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. హెచ్ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌హెచ్‌పిలు వేతన పెంపు, హెచ్ఆర్ పాలసీ, ఇన్సెంటీవ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్లనే సమ్మె అనివార్యమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో ప్రజల మద్దతు కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

దీక్షకు సంఘీభావం తెలియజేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

-డిఆర్ఒ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఈ నెల 12 నుంచి 20 వ తేది వరకు ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు ఇంటర్మీడియట్, జిల్లా విద్యా శాఖ కమిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలలో మొత్తం 13,978 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు. ఈ నెల 12 నుంచి 20 వ తేది వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఉదయం 9 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున పరీక్షకు హాజరు విద్యార్థిని విద్యార్థులు నిర్ణిత సమయంలోగా పరీక్షా కేంద్రానికి రావాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాలలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాలను భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు. అలాగే పరీక్షలు జరిగే రోజు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సందర్భంలో కూడా డిజిటల్ ఇన్స్ట్రుమెంట్స్ లేదా మొబైల్ ఫోన్స్ అనుమతించబడవు అన్నారు.కావున విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఎటువంటి సందర్భంలో మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎవరైనా విద్యార్థులు అస్వస్థకు గురైన యెడల ప్రాథమిక చికిత్స అందించేలా కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, డిఈఓ, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, మెడికల్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

కార్పొరేట్ లాభాల కోసమే లేబర్ కోడ్‌లు : సిఐటియు

సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ మే 20 జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పిలుపునిచ్చారు. మండల కేంద్రం రామా పురంలో ఆయన రైతుసంఘం ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి కార్మికులతో కలసి సమ్మె బుక్ లెట్స్ విడుదల చేసి లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని ప్రచారం చేసి కార్మికలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి కార్పొరేట్ వ్యవసాయం వృద్ధి చేసి రైతులను నట్టేట ముంచేలా తెచ్చే చట్టాలను తిప్పి కొట్టాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందుగాని, తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవీ కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్నవని అన్నారు. మూడు నల్ల చట్టలతో రైతులను, నాలుగు లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, విద్యుత్ రంగాల వారు పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.మ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు చిట్టెమ్మ, లక్ష్మి ప్రసన్న, ఎలక్ట్రిసిటీ వర్కర్స్ విశ్వనాథ్, రమణ, ప్రసాదమ్మ, 108 యూనియన్ నాయకులు శ్రీకాంత్, ఈశ్వరయ్య పాల్గొన్నారు

గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి : ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.గురువారం స్థానిక రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాయచోటి, రాజంపేట మదనపల్లి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో ఎన్‌టిఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.హౌసింగ్ శాఖ పీడీ సాంబశివయ్య జిల్లాలో మండలాల వారీగా ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1, 2024 నుంచి 31 మే, 2025 పూర్తవ్వాల్సిన ఇళ్ళు 12571 ఉండగా అందులో 5232 పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ళ నిర్మాణాలను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు అందించే అదనపు ఆర్థిక సహాయాన్ని అందుకున్న లబ్ధిదారులపై దృష్టి సారించి వారి ఇళ్ళను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.వారంలో రెండు రోజులు ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించాలని హౌసింగ్ శాఖ ఇఇ లను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణ పనులలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ

ప్రజాశక్తి-మదనపల్లె : డెంగీతో పాటు మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు వంటి దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు సమాజ భాగస్వామ్యం అత్యవసరమని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, సబ్‌యూనిట్ అధికారి కళీలుల్లాఖాన్ అన్నారు. మదనపల్లి అర్బన్ పరిధిలోని అమ్మచెరువు మిట్ట సచివాలయం పరిధిలోని మంజునాథ్‌నగర, ముజీబ్‌నగర్ ప్రాంతాల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని వారు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదమని ఇటీవల మలేరియాను ప్రభుత్వం నోటిఫైయబుల్ డిసీజ్‌గా గుర్తించిందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడం, చెత్తను ఊరికి దూరంగా వేసుకోవడం, పందులను గ్రామానికి కనీసం 5 కి.మీ దూరం గా ఉంచ డం, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అన్నారు. నీటి నిల్వలను తొలగి ంచడం, నీటి కుండీలు, బక్కెట్లు, ట్యాంకులు మొదలైన వాటికి మూతలు వేసి మూసి వేయడం, దోమతెరలు వాడటం, కిటికీలకు మెష్ అమర్చుకోవాలని సూచించారు

అంకిత భావంతో పని చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి ఉద్యోగులు ఓవైపు ప్రయాణీకులకు నాణ్యమైన సేవలను, మరోవైపు సంస్థ ఆర్థికాభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తుంచుకోవాలని పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. 2025 ఏప్రిల్ మాసంలో అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగులను గుర్తించి స్థానిక ఆర్‌టిసి గ్యారేజీలో గురువారం ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించి వారిని రివార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఇంధన పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ సేవల్లో నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలంటూ పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏప్రిల్ మాసానికి కెయంపియల్ నిష్పత్తిలో 154.93 లీటర్ల డీజిల్ పొదుపు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన డ్రైవర్లలో ఎంఆర్ మూర్తికి ప్రథమ బహుమతిగా రూ.500లు, 139.13 డీజిల్ పొదుపు సాధించిన జి.యర్రయ్యకు ద్వితీయ బహుమతిగా రూ.300లు చెక్కులతో సత్కరించారు. ఇపికె నిష్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించిన కండక్టర్లు ఆర్. కళావతి, ఐవి కుమారి, ఆర్. భారతి, పి. మస్తాన్, యువి లక్ష్మీ, ఎస్.సి బాష, వి. అమితాబ్ లను ఒక్కొక్కరికి రూ.100 రివార్డుల చెక్కులు అందించి అభినందించారు. వీరు తమ విధుల్లో నిష్ఠ, విధేయతతో కష్టపడుతూ సంస్థ ఆదాయాభివృద్ధికి కీలకపాత్ర వహించారని ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు చెక్కులను అందజేస్తున్న డిఎం నిర్మల

స్కాలర్ షిప్‌కు 'మిట్స్' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె : అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న పి.నందినికి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారి ప్రతిష్టాత్మకమైనబ స్టెమ్ స్టార్స్ వారు స్కాలర్‌షిప్‌ను అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల్లో పి.నందిని ఒకరుగా ఎంపికైనందుకు గర్వంగా ఉందని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ సమీనా తెలిపారు. పి.నందిని కష్టపడి సాధించిన అర్హత, అకాడమిక్ ప్రతిభ వ్యక్తిగత లక్ష్యాల ద్వారా రూ.67,500లు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అందించే ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో సామాజికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆశాజ్యోతి వలె నిలుస్తున్నాయని కొని యాడారు. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్, కరెస్పాండంట్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ఈనెల17 నుండి 26 వరకు మదనపల్లిలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హరి ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబిర్ తో కలిసి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తరపున నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్యం చేస్తూ స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ అగ్ర భావన ఉందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూల నుండి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరు అవుతారని ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం ఉపాధి అవకాశాల కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ నిత్యం పోరాడుతూనే ఉందని చెప్పారు.

పేదలకు ఉపాధి కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పీలేరు నియోజకవర్గ ప్రజలకు ఉపాధి కల్పించి, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడడమే తమ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాటిగుంటపల్లిలోని ఎపిఐఐసి భూముల్లో ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వాడను కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎపిఐఐసికి భూములు ఇచ్చిన రైతుల కుటుంబాల్లో చదువుకొని ఉన్న వారికి పారిశ్రామిక వాడలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 20ఏళ్ల క్రితం తన అన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పుడు మహర్ధశ వచ్చిందన్నారు. ఈ పారిశ్రామిక వాడలతో పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన పరిస్థితులు కల్పించడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు నేతృత్వంలో ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వాడ అన్న నినాదంతో కొత్త శకానికి ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం వహిస్తుందన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయాలన్న లక్ష్యంతో 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వాడలను ప్రారంభించి, అన్ని ప్రాంతాల నియోజకవర్గ ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమ న్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

కిరాణాదాకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి షమీమ్‌బాషా

కిరాణా దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో కిరాణా దుకాణాలపై జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీమ్ బాషా ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. సుండు పల్లిలోని అగ్రహారం పెట్రోల్ బంక్ పక్కన ఉన్న కిరాణా షాపులలో గడువు ముగిసిన తిరుబండారాలు కుర్‌కురేలు, పాలు, పెరుగు, కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో అధికారులు తనిఖీ చేశారు. గడువు ముగిసిన పాలు కురుకురేలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరాణాషాపు యజమానులు కాలంముగిసిన తినుబండారాలు, నిత్యావసర సరుకులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సీతారామయ్య. తెలిపారు.

నేడు కలికిరి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు, గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు పై చర్చ ఉంటుందని దీనిపై సంబంధిత శాఖ అధికారులు తమ శాఖ పట్ల అవగాహన కలిగి ఉండి నివేదికలు సిద్ధం చేసుకొని రావాలని సూచించారు.

15న కలకడ మండలంలో..

కలకడ: కలకడ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 15 నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. గతంలో మూడు పర్యాయాలు కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈనెల 15వ తేదీన జరగవలసిన మండల సర్వసభ్య సమావేశానికి కోరం సభ్యులు హాజరైతే మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగేందుకు అవకాశాలు ఉన్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు తమ తమ నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రూపానందరెడ్డి

కన్యకా పరమేశ్వరిదేవి ఆలయానికి భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని పాత బజారులో శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయానికి గురువారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు గునిశెట్టి రమేష్, చలపాటి హరినాథ్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మి, ప్రభుత్వ విప్ ఆరవ శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ కోడూరు పట్టణంలో శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి నూతన ఆలయ నిర్మాణం ఎంతో శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మేడా వెంకట సుబ్బయ్య, కలువ మురళి, కొప్పురపు అరవింద్, పార్థసారథి, సుందర్‌రాజా, శరత్, కంభం నరసింహ పాల్గొన్నారు.

11న పిటిఎంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 11న వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం, టి.సదుం బస్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 1.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ , ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. ఇసిజి, ,ఎకో, ముందస్తుగా కేన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్యనారాయణస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కమనీయం..శ్రీసత్యనారాయణ స్వామి కల్యాణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని చిప్పిలిలో చిట్టి అన్నవరంలో వెలసిన శ్రీ సత్యనా రాయణస్వామి ఆలయంలో గురువారం ఆలయ కమిటీ అధ్యక్షులు కంచే పల్లి అమరనాథ్, కమిటీ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతం, శ్రీ రమాదేవి సమేత శ్రీ సత్యనారాయణస్వామికి పంచామృతాభిషేకం, శ్రీ ఉమామహేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, వేద పఠనం, మంత్రపుష్ప సమర్పణ, శ్రీ వరసిద్ధి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అలంకరణ, నూతన వస్త్రధారణ కార్యక్రమాలు జరిగాయి.శ్రీ రమాదేవి సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవ కార్య క్రమం ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.అనంతరం ప్రజలకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఫణితేజ శర్మ, పురోహి తులు దుర్గరాజు సుబ్ర హ్మణ్యం పాల్గన్నారు.

మైనార్టీ రుణాలకు 13 యూనిట్లు మంజూరు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలో మైనార్టీలకు ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకుల ద్వారా 13 యూనిట్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి తెలిపారు. స్లాబ్ వన్‌లో కోసువారి పల్లి ఇండియన్ బ్యాంక్ మూడు యూనిట్లు, తంబళ్లపల్లి ఇండియన్ బ్యాంక్ 3యూనిట్లు, ఎస్‌బిఐ4 యూనిట్లు, స్లాబ్ 2 కోసువారిపల్లి ఇండియన్ బ్యాంక్ 1,తంబళ్లపల్లి ఇండియన్ బ్యాంక్ 1, స్లాబ్ 3 లో ఎస్‌బిఐ తంబళ్లపల్లి 1, మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులుకు 50 శాతం సబ్సిడీ మరో 50శాతం బ్యాంకు రుణంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

రామాపురం : రైతులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎఒ నాగమణి

ప్రజాశక్తి-కలికిరి

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారిని మమతారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల సమైఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం లో ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్‌లో 30 రకాల విత్తనాలు వేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం లో సార్వత్రిక సూత్రాలు, మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు, ఖరీఫ్ కార్యా చరణ ప్రణాళిక పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం తోనే తక్కువ ఖర్చులో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని, పురుగు మందులు కాంప్లెక్స్ యూ రియా వంటి రసాయనిక ఎరువులు వాడకం కూడా తగ్గించడం వలన మనుషులకు మంచి ఆరో గ్యం కూడా లభిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించిన రైతు లను సన్మానించారు. కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, ఎపిఎం దేవసేన, రైతు సాధికార సంస్థ మార్కె టింగ్ జిల్లా జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్, మాస్టర్ ట్రైనర్ సుబ్బరా మయ్య, రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఎంఎస్‌ఒబి, విఒఇసి సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం:** రైతులకు రసాయనిక ఎరువులు మందులు తగ్గించి తక్కువ పెట్టుబడి తో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కలిగించాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన వ్యవసాయ శాఖ వెలుగు డిపార్ట్మెంట్ ప్రకృతి వ్యవసాయం సమన్వయంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మందులు వాడకం వల్ల రైతుకు పెట్టు బడి ఖర్చులు ఎక్కువ అవుతాయని సారవంతమైన భూమి తన సహజత్వాన్ని కోల్పో తుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుకు పెట్టుబడులు ఖర్చులు తగ్గించుకొని వ్యవ సాయం సాగించ వచ్చున్నారు.కార్యక్రమంలో ఎఇఒలు కవిత, ప్రభంజన్, వెలుగు సిసిలు, సచివాలయ విఎఎలు, యాంకర్ వెంకట్రామిరెడ్డి ఆదర్శ మహిళా రైతు శ్రీదేవి, రమాదేవి, విఒఎ, విఒ, అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వరి వంగడంతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె : ఆధునిక వరి వంగడంతో రైతు అధిక దిగుబడిని సాధించినట్లు మదనపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శివశంకర్ తెలిపారు. గురువారం నిమ్మనపల్లి రైతు సేవ కేంద్రం పరిధిలోని నాగంవారిపల్లెకు చెందిన రైతు సిజి.రాజారెడ్డి పొలంలో నూతన వరి రకం ఎన్ఎల్ఆర్–3648 చిరుసంచుల ప్రదర్శన క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, కలికిరి కెవికె శాస్త్రవేత్త వై.పీరు సాహెబ్ లతో కలిసి సందర్శించారు. పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రాజారెడ్డి కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం నుంచి నాలుగు కిలోల నూతన వరి రకమైన ఎన్.ఎల్.ఆర్–3648 చిరు సంచిని విత్తనాలను తీసుకువచ్చి జనవరి 25వ తేదీన వరి నాట్లు వేయడం జరిగిందన్నారు. 120 రోజుల పంట కాలం గల ఎన్ఎల్ఆర్–3648 రకం తక్కువ ఎత్తు పెరగడం వలన తుఫానుల దాటికి నేలవాలకుండా తట్టుకోవడం జరుగుతుందన్నారు. నూతన రకంలో కాండం తొలుచు, అగ్గి తెగుళ్ళ వృద్ధిని తట్టుకొని పంట పెరుగుతుందన్నారు. ఎకరాకు సరాసరిగా 35 క్వింటాల దిగబడిని సాధించవచ్చు అన్నారు. రైతు రాజారెడ్డి సాగు చేసిన ఎన్ఎల్ఆర్–3648 వరి రకాన్ని, ఆర్ఎన్ఆర్–15048తో దిగుబడిని పోల్చి చూడగా, చిరుసంచి ఎన్ఎల్ఆర్–3648 అధిక దిగుబడిని నమోదు చేసిందన్నారు. రైతు సంతృప్తిని వ్యక్తం చేస్తూ రానున్న రోజుల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈ రకాన్ని సాగు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎల్ఆర్-3648 వరి రకం దిగుబడిని పరిశీలిస్తున్న ఎడిఎ శివశంకర్

తహశీల్దార్ చొరవతో దారి సమస్య పరిష్కారం

జెసిబితో దారిని ఏర్పాటు చేయిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని పారపట్ల గ్రామ పంచాయతీ కురవపల్లిలో గత కొద్దిరోజులు గా ఉన్న దారి సమస్యను తహశీల్దార్ మహేశ్వరిబాయ్ చొరవతో గురువారం పరిష్కారం అయింది. కలికిరి మండలం పారపట్ల గ్రామము మజరా కురవపల్లిలో సర్వే నెంబర్లు 205, 207, 218లో బహుదానదికి వెళ్ళుటకు 40 కుటుంబాల రైతులకు గత 80 సంవత్సరాలుగా వున్న దారిని కొందరు ఆక్రమించి మూసివేశారు. దారి సమస్యను గ్రామస్తులు తహశీల్దార్‌కు విన్నవించగా గురువారం ఆమె కురవపల్లికి వెళ్లి గ్రామ పెద్ద మనుషులు, గ్రామ రైతుల సమక్షం లో మూసివేసిన దారిని తిరిగి జెసిపితో తెరిపించి గ్రామస్తులకు దారిన అందుబాటులోకి తెచ్చారు. గత కొద్ది రోజులుగా బాహుదా నదిలోకి వెళ్లడానికి దారి లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు సమస్యను పరిష్కరించడంపై తాసిల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు : పీడీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

ఉపాధి హామీ పథకంలో అమలులో ఎలాంటి అవకతవకలు జరిగిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువార మండలంలోని రెడ్డికోటలో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. సప్లై ఛానల్ పని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కూలీలు కోరిన వెంటనే పనులు చూపి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చొరవ చూపాలని ఉపాధి సిబ్బంది సూచించారు. కూలీలు ఎండ వేడిమి దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తరచుగా మంచినీరు తాగాలని, తలకు పాగా చుట్టు కోవాలని, అప్రమత్తంగా ఉండాలని తెలిపరు. ఆయన వెంట ఎపిడి నందకుమార్ రెడ్డి, ఎపిఒ అంజనప్ప, ఎపిఎ బాలగంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతన్న పీడీ వెంకటరత్నం

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని ఎద్దుల వారి పల్లి పంచాయతీ గౌడసానిపల్లెకి చెందిన నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ఐదు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వెళ్తూ అంగళ్ల వద్ద ప్రమాదానికి గురయ్యా తీవ్ర గాయాలై తిరుపతి ఆస్పత్రిలో చికిత్సలు పొంది ఇంటికి వచ్చారు. ఎమ్మెల్యే బాధితుల ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఎలాంటి కష్టనష్టాలు వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కోటకొండ సర్పంచ్ అరుణ, చంద్రశేఖం గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన వెంట మండల వైసిపి కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు పద్మనాభరెడ్డి, మల్లికార్జున, చలపతి, కరీముల్లా, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భారత సైన్యం శౌర్యాన్ని స్మరించుకుంటూ, దేశభక్తిని చాటుతూ అన్నమాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థులు, యాజమాన్యం గురువారం ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, విభాగాధిపతులు, అనుబంధ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఈ.సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యం దేశ బలాన్ని ప్రపంచానికి చాటుతోందని ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఎన్.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ భారతదేశం ఎప్పుడూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమై నిలుస్తుందని, తన సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్ఎంవి.నారాయణ మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచం ఒకే స్వరంతో ఉండాలని, శాంతి పరిరక్షణకు అంతర్జాతీయ మద్దతు అవసరమని పేర్కొన్నారు. పహల్గాం మృతులకు ఘనమైన నివాళి అర్పించారని అన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి పెనుభూతమని, ఉగ్రవాదాన్ని నశింపజేయాలన్నారు. ర్యాలీ ముగింపులో దేశ ఐక్యత, సహనం, సైనిక బలగాలకు అపార మద్దతు అనే స్పష్టమైన సందేశం వినిపించారు.

విజయవంతంగా ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి-పీలేరు

2025–26 ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలపై రైతులు, రైతుసేవా కేంద్ర సిబ్బందికి, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ (ఏపీసిఎన్ఎఫ్) సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. పీలేరులో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ శాఖ, డిఆర్‌డిఎ శాఖ అధికారులు సమన్వయంతో గురువారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యత, ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడమే కాకుండా, కొత్త వ్యవసాయ విధానాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వై.వి. రమణారావు మాట్లాడుతూ పీలేరు మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. ఆయన తెలిపిన ప్రకారం, ముడుపుల వేముల, బోడుమల్లువారిపల్లి గ్రామాలలో 290 మంది రైతులు 235 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారని అన్నారు. రసాయన ఎరువులు, కీటకనాశకాల వాడకాన్ని తగ్గించడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగలుగుతున్నారని వివరించారు. ఈ శిక్షణా శిబిరంలో మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, రైతుసేవా కేంద్ర సిబ్బంది, ఎపిసిఎన్ఎఫ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



ఆదర్శ మహిళా రైతును సన్మానిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వైసిపి పబ్లిసిటీ వింగ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంటుగా హరిప్రసాద్‌రెడ్డి నియమితు లయ్యారు. గురువారం సదుం మండలం, యర్రాతివారిపల్లిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో పబ్లిసిటీ వింగ్ అనేది అత్యంత ప్రధానమైన విభాగమన్నారు. ఆ విభాగా నికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన హరిప్రసాద్‌రెడ్డిని అభినందించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీకి మంచి పేరు తీసుకురా వాలన్నారు. 2029లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన మాజీ సిఎం వై.ఎస్.జగన్, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, నియోజ కవర్గ వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 2029 ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పనిచేస్తామని అన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మునిపద్మనాభం(ఫైల్ ఫొటో)

అనారోగ్యంతో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. మండలంలోని గుడిపల్లి ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కె.మునిపద్మనాభం నెల రోజుల క్రిందట అనారోగ్యం బారినపడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇటీవల ఇంటికి వచ్చారు. గురువారం ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతిచెం దినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడి మృతి పట్ల ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ముని పద్మనాభయ్య ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని, ఆయన మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ఇంటి నుంచే తెలుగు భాషాభివృద్ధి ప్రారంభం కావాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సత్కారం అందుకుంటున్న గంగనపల్లి వెంకటరమణ

తెలుగు భాషాభివృద్ధి, సంరక్షణకై ప్రతి ఒక్క తెలుగువారూ తమ ఇంటి నుంచే ప్రారంభించడానికి నడుం బిగించాలని హైదరాబాదు వేదికగా జరిగిన సభలో గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. తెలుగు భాషకు పట్టాభిషేకం అనే పేరుతో తెలుగుభాషా చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ 12వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాదులోని త్యాగరాయ గాన సభ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులతో నిర్వహించిన భాషా సదస్సులో ఆయన ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. తెలుగు జాతీయులు ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడటం, రాయడం అనేది తమ బాధ్యతగా తీసుకొని, భాషను వినిపించేలా, కనిపించేలా చేసినప్పుడే భాషాభివృద్ధి జరుగుతుందని అన్నారు.ఇందుకోసం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, నటీ నటులు, క్రీడాకారులు తమ వంతు బాధ్యతగా తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలని ఆయన అభిలాషించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్యక్షులు ఆచార్య ఇటికాల పురుషోత్తం, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్, సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎడ్ల కల్లేష్, లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు, ప్రముఖ కవి, రచయిత రామకృష్ణ చంద్రమౌళి, సభాధ్యక్షులు తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లిఖార్జున చేతుల మీదుగా వీరు శాలువా, ప్రశంసా పత్రం అందుకున్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో గల వెలుగు సంస్థలో గురువారం తంబళ్లపల్లి గృహనిర్మాణ శాఖ డిఇ ఎద్దులవాని వెంకటరెడ్డి మదనపల్లె పట్టణం, రెడ్డీస్ కాలనీలో గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా వెలుగు చిన్నారులకు, వృద్ధులకు పెద్ద ఎత్తున అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి నూతనంగా నిర్మించిన భవనాన్ని సందర్శించి వెంకటరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపి విందులో పాల్గొన్నారు. అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. వెలుగు సంస్థలో డిఇ వెంకటరెడ్డి చిన్నారులు, వృద్ధులను కలసి వారి బాగోగులు ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువకుడి హత్య కేసులో నింది తుడిని గురువారం రెండో పట్టణ పోలీ సులు అరెస్ట్ చేశారు. సీఐ రామచంద్ర కథనం మేరకు.. మదనపల్లె మండలం బసినికొండ కాలనీకి చెందిన బాల ఆంజ నేయులు స్థాని కంగా ఉంటున్న గుండా శశికళ అనే మహిళపై రెండు వారాల క్రితం అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో శశికళ తమ్ముడు గుండాసునీల్ మా అక్కతోనే ఇలా చేస్తావా అంటూ బాల ఆంజనేయులుతో గొడవపడి, దాడి చేసి మరోసారి ఇలా చేశావంటే చంపేస్తానని హెచ్చరించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న బాల ఆంజనేయులు తర్వాత సునీల్ తో స్నేహాన్ని నటించాడు. అతనికి మందు తాపిస్తూ దగ్గరయ్యాడు.ఈ క్రమంలో పక్కా ప్రణాళికతో మే 2న సాయంత్రం సునీల్‌ను మందు తాగేందుకు పిలిచాడు. స్థానిక శేషప్ప తోటలోని చర్చ్ వెనుక ఉన్న చింతచెట్టు వద్ద సునీల్‌ను పిలిపించి మద్యం తాపించాడు. అతను మత్తులో ఉండగా ఇదే అదునుగా భావించిన బాల అంజినేయులు అక్కడే ఉన్న బండరాయి సిమెంట్ దిమ్మెలతో సునీల్ తలపై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టి హతమార్చి పరారయ్యాడు. అనంతరం మృతుడి అక్క శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాల ఆంజనేయులు కోసం గాలింపు చేపట్టారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నిందితుడు స్థానిక పుంగనూరు రోడ్డులోని నగరవనం సమీపంలో ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ ఐ రహీముల్లా అక్కడికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తానే సునీల్ హతమార్చినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు.

నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు